RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 216 | జులై 24, 2025 | వెల : రూ.3-00

## మంత్రి పదవి కంటే.. వాళ్లే ముఖ్యం..

**హైదరాబాద్, వేదన్యూస్ :**



కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీ నగర్ నుంచి పోటీ చేస్తే తనకు మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చారని తెలిపారు. కానీ తనకు మంత్రి పదవి కంటే కూడా మునుగోడు ప్రజలే ముఖ్యమని.. అందుకే ఇక్కడి నుంచే పోటీ చేశానని తెలిపారు.నల్గొండ జిల్లా మునుగోడు మండలంలో ఏర్పాటు.. మిగతా 4వ పేజీలో..



# రిజర్వేషన్లు పెంచాలి

- రాజ్యాంగానికి లోబడి..
- రాజ్యాంగం అందరికీ ఒక్కటే
- 50శాతం పరిమితిని ఎత్తివేయాలి
- 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి
- సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, డెస్క్:**

తెలంగాణలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభ ఆమోదించిన బిల్లులకు చట్టబద్ధత కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడానికి ఢిల్లీ వచ్చినట్టు వివరించారు. బీసీలకు విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు, అలాగే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ శాసనసభ పూర్తిస్థాయిలో చర్చించి ఆమోదించిన రెండు బిల్లులను ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని అన్నారు. రాష్ట్ర హైకోర్టు 90 రోజుల్లో స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పలువురు ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ రెండు బిల్లుల ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేని కలిసి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే జరిపిన తీరు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన శాస్త్రీయ విధానాలను వివరిస్తాం. తర్వాత ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలను కలిసి వివరించి వారి మద్దతు కోరుతాం. తద్వారా సమన్వయంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ శాసనసభలో అన్ని పక్షాలు మద్దతు పలికాయి. తెలంగాణలో 4 ఫిబ్రవరి 2024 రోజున ప్రారంభించి 4 ఫిబ్రవరి 2025 నాటికి సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యా, రాజకీయ, కుల సర్వేను పూర్తి చేశాం. అందుకే ఫిబ్రవరి 4 ను సామాజిక న్యాయ దినోత్సవంగా (సోషల్ జస్టిస్ డే) జరుపుతున్నాం. ఈ సర్వేలో తెలంగాణలో 3.55 కోట్ల మంది వివరాలు వెల్లడించారు. సర్వే వివరాలపై మంత్రిమండలి ఆమోదం తర్వాత శాసనసభలో పూర్తిస్థాయిలో చర్చించామని తెలిపారు. దాని ప్రకారం 56.4 శాతం బీసీలు, 17.45 శాతం ఎస్సీలు, 10.08 శాతం ఎస్టీలు, 10.09 శాతం ఉన్నత వర్గాల వారు ఉన్నారు. అలాగే 3.09 శాతం మంది తాము ఏ కులానికి చెందమని ప్రకటించారు. తెలంగాణలో ఇదో కొత్త పరిణామం అని అన్నారు. సర్వేపై స్వతంత్ర నిపుణుల సలహా కమిటీని నియమించి ఆ కమిటీకి ఇచ్చాం. వారు దానిపై చర్చించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఆ నివేదికను మంత్రివర్గంలో చర్చించి శాసనసభలో ప్రవేశపెడతాం. సర్వే చేసినప్పటికీ డేటా ప్రైవసీ చట్టం ప్రకారం వ్యక్తిగత వివరాలు వెల్లడించకూడదని ఆ వివరాలను బహిర్గత పరచలేదని స్పష్టం చేశారు. కుల గణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి దిక్సూచిలా నిలిచింది. తొలుత కుదరన్న కేంద్ర ప్రభుత్వం కూడా వివిధ రకాల ఒత్తిళ్లతో జన గణనలో కుల గణన చేర్చింది. తెలంగాణ చేసిన సర్వే ఒక దిక్సూచిలా ఉంటుంది. దేశవ్యాప్తంగా జరిపే కుల గణన సేకరణకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ మాడల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం అందరికీ ఒక్కటే. వేర్వేరు పార్టీలకు వేర్వేరు రాజ్యాంగం ఉండదు. రాజ్యాంగానికి లోబడి రిజర్వేషన్లు పెంచాలని అడుగుతున్నాం. వితండవాదాలకు తావివ్వకుండా తెలంగాణలో అమలు చేయతలపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేసుకోవలసిన అవసరం ఉంది. 2018 లో పంచాయతీ రాజ్ చట్టంలో రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలులేదని పరిమితి విధించారు. ఆ పరిమితిని ఎత్తివేసి ఆ చట్టంలో సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేశాం. దానిపై గవర్నర్ గారి కార్యాలయం కోరిన వివరాలను అందించింది. ఆర్డినెన్స్‌కు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధం లేదు.

దేశంలో 10 శాతం మేరకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ఇవ్వడంతోనే 50 శాతం పరిమితి అంశం పక్కకు పోయింది. రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి అన్న అంశానికి కాలం చెల్లిపోయింది. అనేక అంశాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత వచ్చిన సర్వే ఫలితాల ఆధారంగా 42 శాతం బీసీల రిజర్వేషన్లను అడుగుతున్నాం. ఇది ఎవరో ఒక వ్యక్తి కోసం కాదు. మొత్తం జాతి కోసం అడుగుతున్నాం. వందేళ్ల తర్వాత కుల గణన జరిగింది. రిజర్వేషన్లను సాధించుకోవడానికి మేమంతా సిద్ధమై వచ్చాం. మేం దీనిపై పోరాటం చేస్తాం..” అని వివరించారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్, హర్కర వేణుగోపాల రావు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, పోరిక బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురామిరెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ, డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**వేద న్యూస్, వేములవాడ :**



వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను పరిశీలించి, వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంత మంది వైద్య సేవల కోసం వస్తున్నారని, ఎంత మందికి డయాగ్నోస్టిక్ సేవలు అందిస్తున్నారనే వివరాలను ఆరా తీశారు. వైద్య పరీక్షల కోసం ఎన్ని శాంపిల్స్ ను టీ హబ్ కు పంపిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సిబ్బంది అందరూ ఖచ్చితంగా ఆరోగ్య కేంద్రంలోనే అందుబాటులో ఉండి, పేషెంట్లకు వైద్య సేవలు అందించాలని సూచించారు.

**యూరియా అందుబాటులో ఉంచాలి**


హన్మాజీపేట గ్రామంలోని మహర్షి ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వివరాలను ఆరా తీశారు. రైతుల సౌకర్యార్థం యూరియా అందుబాటులో ఉంచేలా చూడాలని, స్టాక్ అయిపోయిన వెంటనే తెప్పించాలని సూచించారు.

# తస్మాత్ జాగ్రత్త..!



**వేద న్యూస్, వేములవాడ :**

వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో నేడు నక్క వాగు పై బ్రిడ్జిని ప్రారంభించారు. అయితే బ్రిడ్జిని ఆనుకొని వ్యవసాయ బావి ఉంది. దానిపై ఎలాంటి అడ్డు లేకపోవడంతో బ్రిడ్జి నుండి జారితే బావిలో పడే ప్రమాదం ఉంది. వెంటనే బ్రిడ్జి కి సైడ్ రేలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. బావిలో పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గత కొద్ది రోజుల క్రితం ఓ బాలుడు ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆ భావి పక్కనే పడిపోయాడు. బాలుడు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గ్రామంలో విషాద నింపింది.



## వైద్యశాఖలో 309 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు

**హైదరాబాద్, వేదన్యూస్ :**

రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో 33 స్పెషాలిటీ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 309 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ప్రభుత్వం జీఓలు జారీ చేసింది. ఈ క్రమంలో త్వరలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు లభించనున్నాయి. సర్కార్ ఇటీవలే 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుంది. మరో 714 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. మెడికల్ కాలేజీల అభివృద్ధి, ఫ్యాకల్టీ కొరతను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నేషనల్ మెడికల్ కమిషన్ ఇటీవల ప్రశంసించింది. ఒక్క సీటుకు కూడా కోత పెట్టకుండా, ఒక్క రూపాయి జరిమానా విధించకుండా అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుమతులు కొనసాగిస్తున్నట్టు ఎన్ఎంసీ వెల్లడించింది.

## ‘తూర్పు’ప్రజల అశీస్సులతోనే మంత్రిని అయ్యా..



- పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ప్రతి పేదవాడి కల ఇందిరమ్మ ఇల్లు
- అధికారులు నిబద్ధతతో పనిచేయాలి
- దళారుల ప్రమేయముంటే చర్యలు
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ
- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాల అందజేత

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

పేద ప్రజల అభివృద్ధి సంక్షేమమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని స్పష్టం చేశారు. మధ్య దళారుల ప్రమేయం ఉంటే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం జిడబ్ల్యుఎంసి పరిధిలోని 12వ డివిజన్ దేశాయిపేట ఎస్సీ కాలనీ ప్రాంతంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు,జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి స్థానిక కార్పొరేటర్ కావేటి కవితతో కలిసి ఇళ్ల నిర్మాణ పనులను మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ ప్రతులను మంత్రి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ అధికారులతో కలిసి దేశాయిపేట ఎస్సీ కాలనీలో కలియ తిరుగుతూ.. అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలని, నియోజకవర్గానికి 3,500 ఇల్లు మొదటి విడతలో మంజూరయ్యాయని, రెండో విడతలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులను ఏమాత్రం ఆలస్యం చేయడం లేదని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తున్నదని, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఉగాది నుండి రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఆరోగ్యశ్రీ పరిస్థితిని 10 లక్షల రూపాయలకు పెంపు,కొత్త రేషన్ కార్డుల జారీ, మహిళలకు ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి పేదవాడి కల ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామన్నారు. మొదటి విడుదల మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్



# శరీర దానం,నేత్రదానం..ఇద్దరి అందులకు చూపు

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ పోచమ్మ మైదాన్ నివాసి అడ్డ గుడి తేజో మూర్తి అనారోగ్యంతో మరణించగా, కుమార్తెలు వాసవి, జాహ్నావి సమాజ హితం కోరి, వైద్య విద్యా నిమిత్తం, మెడికల్ కాలేజీకి శరీర దానం చేయుటకు అంగీకరించగా,తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ లో దేహాన్ని కేఎంసీ అనాటమీ విభాగానికి అప్పగించామన్నారు. ప్రిన్సిపల్ డా సంధ్య, అనాటమ విభాగాధిపతి మొహిద్దీన్ ఖాన్ ఆదేశం తో సిబ్బంది ప్రేమ్ కుమార్, యాద గిరి, ప్రణయ్ దేహాన్ని అనటమీ విభాగానికి తరలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శరీర దానంపై అవగాహన కలిగియుండి, మరణానంతరం శరీర దానంచేస్తే, బావి వైద్యులకు వైద్య విద్య అధ్యయనం కోసం, శాస్త్ర పరిశోధన కోసం, సర్జరీని నేర్చుకోవడానికి ఉపయోగపడుతుందని కోరారు. శరీర దానం చేసిన కుటుంబ సభ్యులకు ధన్యవాదములు తెలిపి, శరీర దాన సర్టిఫికెట్ కుటుంబ సభ్యులకు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం వరంగల్ ప్రాంతీయ నేత్ర శాల వైద్య సిబ్బంది నేత్ర సేకరణ నిపుణులు రాజేంద్రప్రసాద్ ద్వారా నేత్ర సేకరణ చేశామన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేస్తే ఇద్దరు అందులకు చూపునిస్తాం, శరీర దానం చేస్తే వందల మందికి వైద్య పాఠం అవుదామని, అవయవ దానం చేసి ప్రాణదానం చేద్దాం అని అన్నారు ఎవరైనా శరీర దానం, అవయవ దానం చేయాలనుకుంటే వివరాలకు 8790548706, 9490133650 ఈ ఫోన్ నంబర్లను సంప్రదించవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ రాజేంద్రప్రసాద్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పరికిపండ్ల వేణు, ట్రెజరరీ నరసింహా రాములు, ముఖ్య సలహాదారులు కే భారతి, విజయ కుమారి పాల్గొన్నారు.






## నిస్వార్థంగా సేవ చేసే
# అభ్యర్థులని గెలిపించాలి

**వేద న్యూస్, శాయంపేట :**

శాయంపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యాశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రబారి చదువు రామచంద్రారెడ్డి హాజరు అయి వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా వారు కోరారు .ఒకే పార్టీని నమ్ముకుని పార్టీలు మారకుండా నిస్వార్థంగా ప్రజాసేవ అంకితమైన బిజెపి కార్యకర్తలని గెలిపించాలని అవకాశవాద రాజకీయాలతో పార్టీలు మారుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలకు వెళ్లే నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని, గతంలో టిఆర్ఎస్ ప్రజలకు చేసింది ఏమీ లేదని ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా ఇచ్చినటువంటి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజల్ని మభ్యపెడుతుందని రానున్న రోజులలో బిజెపి అభ్యర్థుల్ని స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిపించాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శులు, మామిడి విజయ్, భూతం తిరుపతి,సీనియర్ నాయకులు, తాటికొండ రవికిరణ్, వనం దేవరాజు,ఉప్పు రాజు, లడే శివ, మంద సురేష్, మోత్కూరు సత్యనారాయణ, కోడెపాక సంజీవరావు, మండల ఉపాధ్యక్షుడు కోమటి రాజశేఖర్, మండల కార్యదర్శి మేకల సుమన్, కోశాధికారి కుక్కల మహేష్, ఎర్ర రాకేష్ రెడ్డి బూతు అధ్యక్షులు కడారి చంద్రమౌళి, బాసని నవీన్, వంగాల భాస్కర్ రెడ్డి, మూడేళ్ల పైడి, పున్నం సాంబయ్య, కన్నెబోయిన రమేష్,ఎర్ర తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మెట్టుగుట్టపై మాస శివరాత్రి
# ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, మడికొండ :**

ఓరుగల్లు మహా నగరంలో అతి ప్రాచీనమై, దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానములలో బుధవారం మాస శివరాత్రి పురస్కరించుకొని శ్రీ స్వామి వారికి ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించి అనంతరం లోక కళ్యాణార్థమై యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, స్వామి వారిని దర్శించి, అభిషేకించి, హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శివాలయం కార్యనిర్వహణాధికారి శేషు భారతి, రామాలయం కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ అర్చకులు రాగిచేడు అభిలాష శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి చేసిన వ్యాఖ్యలను
# తక్షణమే వెనక్కి తీసుకోవాలి

**వేద న్యూస్, చొప్పదండి :**



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఢిల్లీలో బీసీ రిజర్వేషన్లపై చేసిన వ్యా ఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని జాతీయ బిసి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు గుంటి స్వరూప శ్యామ్ డిమాండ్ చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేష న్లపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు న్యాయ పరమైన అంశాలపై అవగాహన లేదని పూర్తి అజ్ఞానంతో వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి తొమ్మిదో షెడ్యూల్లో పెట్టడం సాధ్యం కాదనుకున్నప్పుడు అసెంబ్లీ బిజెపి శాసనసభ్యులు బిల్లుకు ఎందుకు మద్దతిచ్చారు అని, ఎందుకు యూటర్న్ తీసుకుంటున్నారో చెప్పాలని ప్రశ్నించారు. దీంతో బిజెపికి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలిసిపోయింది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బీసీల లిస్టులో కేంద్రంలోని ఓబీసీల జాబితాలో ముస్లింలు ఉన్నారు అనే అంశంపై బీజేపీ ఎందుకు మాట్లాడరు అని ప్రశ్నించారు. తమిళనాడు 1994 నుంచి 69శాతం రిజర్వేషన్లు అమలవుతున్న విషయం బిజెపి ప్రభుత్వానికి తెలీదా అని బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు తక్షణమే వెనక్కి తీసుకోవాలి. లేదంటే బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేక వైఖరి మార్చుకోకపోతే తెలంగాణలోని బీసీలంతా ఏకమై బీసీ వ్యతిరేక పార్టీలను భూస్థాపితం చేస్తాం అని అన్నారు.

# ఆర్థిక చేయూత

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం పెద్దకోడపాక గ్రామానికి చెందిన పైండ్ల సాంబయ్య అనారోగ్యంతో మరణించడముతో తన కుమారుడు అయిన పైండ్ల మహేష్ 2005 సంవత్సరం చదువు కున్న పదవ తరగతి మిత్రులు వారి తండ్రికి నివాళులు అర్పించి, సానుభూతి తెలిపి రూ.30వేల రూపాయలు అర్థిక సహాయాన్ని తమ కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు.గత ఏడు సంవత్సరాల నుండి తమతో పాటు చదువుకున్న 2005 సంవత్సరము చదువు కున్న పదవ తరగతి మిత్రుల కుటుంబంలో ఎలాంటి ఆపద వచ్చిన వారికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ బాసటగా నిలుస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసి శ్రావణ్ కుమార్, రంగు రాజేష్, కోగిల సుమన్, పెద్ద సుమన్, తిరుపతి,అశోక్, వెంకటేష్, పైండ్ల భాను,నరేష్,కర్ణాకర్ ,మోరె సుమన్ పలువురు మిత్రులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం




**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు ,జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని,ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడినీ అరికట్టాలని,రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త పాఠశాలు,జూనియర్ కళాశాలల బంద్ రాజన్న సిరిసిల్ల జిల్లా,మండల కేంద్రంలో విజయవంతం జరిగింది అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ.విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలని. మెస్ కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని.విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని అన్నారు.ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న బోజన పథకాన్ని అమలు చేయాలని.బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చెయ్యాలని ప్రైవేట్,కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని అన్నారు. విద్యార్థులకు ఆర్టీసీ లో ఉచిత బస్ పాస్ లు ఇవ్వాలని నూతన జాతీయ విద్య విధానం(ఎన్ ఈ పి2020) తెలంగాణలో అమలు చెయ్యకుండా అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి విద్యారంగ సమస్యను పరిష్కరించాలని, వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ కు సహకరించివిజయవంతం చేసిన విద్యాసంస్థలకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల అధ్యక్షులు బండారి చందు గౌడ్,పున్ని పవన్, దొమ్మటి శ్రీహరి, గుంటి రాజు, జామచెట్టి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని..లక్ష్యం వైపు పయనించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు.మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపైబుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్ డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా నార్కోటిక్ సమావేశంలో పాల్గొనే ప్రతి శాఖ ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ ఇతర ఉన్నత విద్యా సంస్థల వద్ద డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై పోలీస్, ఎక్సైజ్ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలునిర్వహించాలని సూచించారు.మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించాలని కలెక్టర్ సూచించారు.అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు,మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య అడిషనల్ ఎస్పీ చంద్రయ్య మాట్లాడారు.మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులకు యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు చేపట్టి విజేతలకు బహుమతులు అందజేశామని తెలిపారు. యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో డీఎం హెచ్ ఓ రజిత, డీఏఓ అఫ్జల్ బేగం, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, డీఐఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

**వేద న్యూస్, చొప్పదండి :**



ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూఎస్పిసి ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలో భాగంగా చొప్పదండి మండల తహసిల్దార్ నవీన్ కు మెమోరాండం అందించారు. ఇట్టి సందర్భంగా డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ డీఎలను వెంటనే ప్రకటించాలని, పిఆర్సిని తక్షణ అమలు చేయాలని, 010 పద్దు కింద మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జీతాలు అందించాలని అన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ములకల కుమార్ మాట్లాడుతూ 5571 పిఎస్హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని, జూనియర్ లెక్చరర్ పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్లకు 40శాతం వాటాను పునరుద్ధరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీవితాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ స్టేట్ కౌన్సిలర్ సముద్రాల అంజయ్య, కానిగంటి రాజమౌళి, యుటిఎఫ్ మండలధ్యక్షులు ఎల్లయ్య, డిటిఎఫ్ మండల అధ్యక్షులు గుర్రాల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉత్కం వేణుగోపాల్, టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు యామ తిరుపతి, జిల్లా కార్యదర్శి రామస్వామి, సంగనభట్ల సురేందర్, ఎండి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భారతీయ మజ్దూర్ సంఘ్
# ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**వేద న్యూస్, కాజీపేట :**

భారతీయ మజ్దూర్ సంఘ్ 70వ సంవత్సరాల వార్షికోత్సవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిట్ ప్రాంగణంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నిట్ వరంగల్ గౌరవ అధ్యక్షుడు మాజీశాసనసభ్యులు,బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మార్తినేని ధర్మారావు ముఖ్యఅతిథిగా హాజరై బిఎంఎస్ జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ భారతీయ మజ్దూర్ సంఘ్ భారతదేశంలో ఒక ప్రముఖ కార్మిక సంఘం అని, ఇది 1995 జులై 23న ప్రఖ్యాత జాతీయవాది, కార్మిక నాయకులు దత్తోపంత్ తెంగడి చే మధ్యప్రదేశ్ రాజధాని భూపాల్ నగరంలో స్థాపించబడిందని అన్నారు. దీని ముఖ్య లక్ష్యం కార్మికుల హక్కులను పరిరక్షించడం, వారి సంక్షేమం, కార్మికులకు సరైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, సామాజిక భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించడం కోసం కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాజిపేట మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, కాంట్రాక్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ కరుణాకర్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కార్యదర్శి ప్రమోద్, ఉపాధ్యక్షులు కార్తిక్, లాలు, శారదా,మురళి, విజయ్ కుమార్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమం కోసం
# ప్రభుత్వం ప్రత్యేక కృషి



**- ఎమ్మెల్యే సత్యం**

**వేద న్యూస్, చొప్పదండి :**

రాష్ట్రంలో మహిళలకు 6,680 కోట్ల రూపాయల విలువైన 200 కోట్ల మహిళా ఉచిత బస్ ప్రయాణం పూర్తి చేసుకున్న సందర్భంగా చొప్పదండి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిసి బస్ లలో ఉచితంగా ప్రయాణం కల్పించామన్నారు. మహిళల ఉచిత బస్ ప్రయాణ సేవలను కేటీఆర్, హరీష్ రావు లు జీర్ణించుకుంటలేరని, ఇంటి ఆడబిడ్డను గౌరవించని వారి నుండి అంతకన్నా ఎక్కువగా ఆశించడం అత్యాశే అవుతుందన్నారు. మహిళలు, విద్యార్థులు ఉచిత బస్సులను విద్యా, ఉద్యోగాలు, జీవనోపాధి, దైవ దర్శనాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 6,700 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఉచిత బస్ ప్రయాణం కోసం విడుదల చేశామని రాబోవు రోజుల్లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళా సంక్షేమమే ప్రాధాన్యత అంశంగా పాలన అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సన్మానించి, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డిఎం శ్రీనివాస్, తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపిడిఓ వేణుగోపాల్ రావు, మున్సిపల్ కమీషనర్, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, ఆర్టీసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బడి బ్యాగ్ భారం కావొద్దు

**వేద న్యూస్, చొప్పదండి/ గంగాధర :**

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల పాఠ్య పుస్తకాలకు సంబంధించిన బ్యాగు పది కిలోలు ఉండడంతో విద్యార్థులకు భారంగా మారి ఇబ్బంది పడుతున్నారు. గంగాధర మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు ప్రత్యేక చొరవ చూపించి అన్ని విషయాలను కవర్ చేస్తూ బడి బ్యాగు కేవలం మూడు కిలోలు మాత్రమే ఉండేలా కొత్త పుస్తకాలను ఇచ్చారు. దీంతో విద్యార్థులు ప్రతిరోజు కిలోలు మాత్రమే ఉండే బడి బ్యాగ్ తో ఏ ఇబ్బంది లేకుండా పాఠశాలకు వస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బడి బ్యాగు తేలికగా ఉండేలా చర్యలు తీసుకున్న ఎంఈఓ ప్రభాకర్ రావును ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్ర ఎడ్యుకేషనల్ డైరెక్టర్ నికోలస్ తో ఫోను మాట్లాడి ఎంఈఓ పనితీరును వివరించారు. గట్టుభూత్కూరు ప్రభుత్వ పాఠశాలలో అనుసరిస్తున్న మూడు కిలోల విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బడి బ్యాగ్ మూడు కిలోలు మాత్రమే ఉండేలా వినూత్నంగా ఆలోచన చేసిన ఎంఈఓ ప్రభాకర్ రావును సన్మానించారు.

### స్థానిక ఎన్నికల్లో
## కాషాయ జెండా ఎగరాలి



**వేద న్యూస్, చొప్పదండి రామడుగు :**

కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారం చేపట్టిన కాంగ్రెస్ మాటలు ఇక తెలంగాణా ప్రజానీకం నమ్మరని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాషాయ జండా ఎగుర వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని శానాగర్ లో ఓ ప్రైవేట్ హాల్లో ఏర్పాటు చేసిన కార్య కర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు 420 హామీల్లో ఒక్క మహిళలకు ఉచిత బస్ ప్రయాణం తప్ప ఏది పూర్తి స్థాయిలో నెరవేర్చలేదన్నారు. ప్రజా పాలన పేరిట దరఖాస్తులు తీసుకోవడం బుట్ట దాఖలు చేయడం తప్ప ఇచ్చిన హామీ ఏ ఒక్కటి ఉద్ధరించింది లేదని ఆయన ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ మోసం చేయడానికి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ విషయం ముస్లిములకు 10 శాతంతో ముడిపెట్టి బీసీలకు అన్యాయం చేయడానికి కుట్రలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ చేసిన పాపానికి ఇప్పటికే పట్ట భద్రుల ఉద్యోగుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని ఆయన గుర్తు చేశారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కేంద్రం నిధులతోనే అనే విషయం ప్రజలు గుర్తించారన్నారు. ప్రధాని మోడీపై వారు పూర్తి విశ్వాసంతో ఉన్నారని కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ గెలుపు ఆగదని ఈ సందర్భంగా కృష్ణా రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మోడీ రవిందర్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్, మాజీ కార్యవర్గ సభ్యులు కట్ట రవీందర్, జిల్లా కార్యదర్శి ఉప్పు రామకృష్ణ, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు జెన్నారం విద్యాసాగర్, జిట్టవేణి అంజి బాబు, బండ తిరుపతి రెడ్డి తదతరులు ఉన్నారు.

## పేకాట రాయుళ్లు అరెస్టు



**వేద న్యూస్, గంభీరావుపేట :**

గంభీరావుపేట మండలంలోని నాగంపేట గ్రామ శివారులో మూడుముక్కల పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు. నమ్మకమైన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు యుక్తంగా అక్కడికి వెళ్లారు. పోలీసుల రావడాన్ని గుర్తించక ముందే నాగంపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నారు. దీంతో పాటు పేక ముక్కలురూ. 11,500 నగదు మూడు మోటార్ సైకిళ్లు,రెండు సెల్ఫోన్లు. స్వాధీనపరచుకొని వారి మీద కేసు నమోదు చేశామని ఎస్సై ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

## వజీరాబాద్ మేజర్ ద్వార నీటి విడుదల

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గంలో సాగర్ ఎడమ కాలువ ద్వారా విడుదలైన నీటిని వజిరాబాద్ మేజర్ మరియు ముల్కల్ కాలువ మేజర్ల ద్వారా మిర్యాలగూడ నియోజకవర్గ రైతులకు సాగు కోసం నీటిని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేత

**- పెండింగ్‌లో ఉన్న వరద కాలువ పనులకు 170 కోట్లు కేటాయించాలి.**

**వేదన్యూస్, కరీంనగర్ జిల్లా:**

శ్రీరామ్ సాగర్ వరద కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు ఇందుర్తి నుండి భీమదేవర పల్లి వరకు ప్యాకేజీ 3 లో చేపట్టాల్సిన పనులు నిలిచిపోయాయని దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డికి హైదరాబాదులోని సచివాలయంలో మంత్రి కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్యాకేజీ త్రీలో చేపట్టాల్సిన పనులు నిలిచి పోవడంతో చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల రైతులు, సైదాపూర్, భీమదేవరపల్లి గ్రామాలకు పనులు చేపట్టాల్సిందన్నారు. బ్రిడ్జిలు, కాలువలు, నిర్మించినప్పటికీ వరదలలో కొట్టుకుపోయి గండ్లు ఏర్పడినాయన్నారు. 170 కోట్లతో నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించినప్పటికీ నిధులు నీటిపారుదల శాఖలో పెండింగ్ లో ఉన్నాయన్నారు. కాలువలు పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల రైతులు సాగునీరు అందక ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి నుండి భీమదేవరపల్లి మండలం వరకు పలు గ్రామాల్లో ప్యాకేజీ 3 పనులు నిలిచిపోయాయన్నారు. అట్టి పనులకు గాను అంచనాకు 170 కోట్లు మంజూరు చేయాలని చాడ వెంకటరెడ్డి మంత్రిని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో చాడతోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే స్వామి, మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ ఉన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి









**- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**వేదన్యూస్ హనుమకొండ:**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి విభాగాన్ని పరిశీలించి అక్కడ ఉన్న పేషెంట్స్ తో కలెక్టర్ మాట్లాడి ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీని సందర్శించి మందుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. ఈ-ఔషధి పోర్టల్ లో ఫార్మసికి కావాల్సిన మందులను ఎలా ఇండెంట్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉప కేంద్రాలకు మందులను ఏ విధంగా అందిస్తున్నారనే వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్సిడి కార్యక్రమంలో బీపీ,షుగర్ లాంటివి ఏ విధంగా స్క్రీనింగ్ చేస్తున్నారని, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులను ఏ విధంగా అందుతున్నాయి అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తొలగింపు ప్రతిపాదనలో ఉన్న ఆరోగ్య కేంద్రంలోని పేషంట్ వార్డ్, థియేటర్లను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలించి నమూనాలను ఏ విధంగా సేకరిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రమైన వాతావరణము ఉండాలని, నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. అవసరమైన మందులు అన్ని ఫార్మసీలో అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, యుపిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ భార్గవ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ సమాజానికి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి

**- బీసీ జానాధికార సమితి - రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే**

**వేద న్యూస్, హనుమకొండ :**

బట్టలు ఉతుకునే జాతి వీర్లపెల్లి శంకర్ ఎమ్మెల్యే అయిండు చేపలు పట్టుకునే శ్రీహరి మంత్రి అయ్యిండు కులాల పేరుతో అనుచిత వ్యాఖ్యలుగా రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో అగ్రకుల ఆధిపత్య అహంకారంతో మాట్లాడిన రేవంత్ రెడ్డి గారు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బీసీ సమాజానికి కులవృత్తులు చేస్తున్న ఉత్పత్తి కులాల సేవకులాల సమాజానికి భే షరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం, మీరు అధికారంలోకి రావడానికి ఈ కులాల ఓట్లు కావాలి,ఆనాటి నుండి నేటి వరకు ఈ సభ్య సమాజాన్నికి మనిషి మనుగడకు శుభ్రతను ఆరోగ్యాన్ని అందించిన ఆ కులమే బట్టలుతుకునే వృత్తి రజక (చాకలి-ధోభి) కులం ఆనాదికాలంలో సౌడు మట్టి నుండి అంటూ ముట్టు మైల పట్టిన బట్టలను శుభ్రం చేసి ఈ ప్రపంచానికి సబ్బు సోడానందించిన మొట్టమొదటి శాస్త్రజ్ఞుడు రజకులు సమాజానికి మనిషి పుట్టిన నుండి చావు వరకు అనేక కార్యక్రమాలలో సేవ చేసే వృత్తి బట్టలు పిండే రజక బిడ్డ అలాగే నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛభారత్ పితాహమాలు సంత్ గాడ్గే బాబా జీవితం మొత్తం ఈ సమాజానికి దేశానికి మొట్టమొదటి ఘోరక్షసాలలు అనాధ ఆశ్రమాలు ఏర్పాటు చేసి నిమ్న కులాలకు ఉత్పత్తి కులాలకు విద్య ఆశ్రమాలు ఏర్పాటు చేసి మూఢనమ్మకాలను నమ్మొద్దని చదువుకుంటేనే ఆత్మగౌరవం లభిస్తుందని 156 ఆశ్రమాలను ఏర్పాటు చేసిన గొప్ప మహనీయుడు స్వచ్ఛభారత్ పితామహులు సంత్ గాడ్గే బాబా రజక (ధోభి) బిడ్డనే ఇప్పటికీ మహారాష్ట్ర లో స్వచ్ఛభారత్



సంతు గాడ్గే బాబా అనే నినాదంతోనే కార్యక్రమం నడుస్తుంది, భారతదేశ స్వతంత్రం పూర్వమే దున్నేవాడిదే భూమికోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం తెలంగాణ తల్లి చాకలి ఐలమ్మ పోరాటం ఈ ప్రపంచానికి ఆదర్శం విస్నూర్ రామచంద్రారెడ్డి ని తన్ని తరిమిన రోజులు గుర్తుకు లేవా రేవంత్ రెడ్డి గారు దొర గడులను కూలగొట్టి మొక్కజొన్న పండించిన చరిత్ర మర్చిపోయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కండ్లు తెరుచుకొని బట్టలు ఉతికే జాతి అంటే ఆరోగ్యాన్ని పరిచయం చేసిన జాతి బట్టలుతుకునే కులం రజకులు అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుల జనగణన చేపట్టాలని, స్థానిక ఎన్నికలలో 42% రిజర్వేషన్లు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన అంశాన్ని చట్టబద్ధత కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా 17 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసిన చాపర్తి కుమార్ గాడ్గే కూడా ఒక రజక బిడ్డ ముఖ్యమంత్రి గారు,రజక కులస్తులకు బీసీ సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా కులాహంకారంతో మాట్లాడుతున్న రెడ్డి దొరల పార్టీలను రేపు జరగబోయే స్థానిక ఎన్నికలలో ఓడగొట్టాలని రజక కుల బంధువులకు పిలుపునిచారు...

వేద న్యూస్

గురువారం జులై 24, 2025

# “తూర్పు” ప్రజల ఆశీస్సులతోనే మంత్రిని అయ్యా..



**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రవ్యాప్తంగా 22 వేల 500 కోట్ల రూపాయలతో నాలుగు లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులు అధైర్య పడాల్సిన అవసరం లేదని మంత్రి హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల దేవదాయ శాఖకు రూ. 176 కోట్ల ఆదాయం లభించిందని మంత్రి తెలిపారు.

**“తూర్పు” ప్రజల ఆశీస్సులతోనే మంత్రిని అయ్యా..**

గతంలో చేసిన అభివృద్ధి తప్ప గత 10 ఏళ్లలో అభివృద్ధి జరగలేదన్నారు. కొండా దంపతులు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనుల వల్లే ప్రజలు ఆశీర్వదించడం వల్ల ఎమ్మెల్యే, మంత్రి అయ్యానని, తూర్పు నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తూ.. అన్ని డివిజన్లను పూర్తిస్థాయిలో పూర్తి చేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న షాదిఖానను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. మహిళలు తలచితే ఏదైనా సాధిస్తారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో 6 గ్యారంటీలు మహిళల పేరు మీదే నామకరణం చేయడం జరిగిందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచడంతోపాటు 200శాతం కాస్మెటిక్ చార్జీలను పెంచడం, పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు మెప్మా ద్వారా కుట్టించిన యూనిఫామ్ లు పాఠ్యపుస్తకాలు అందించి.. ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలలను బలోపేతం చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. కోటి మహిళలను కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతో మహిళలకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, తూర్పు లోని 5 మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ ద్వారా ఐదు బస్సులను అద్దెపై నిర్వహించుకొనుటకు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వెనుకబడిన తరగతుల వారికి కమ్యూనిటీ హాల్ లకు బదులు మ్యారేజ్ హాల్ లను నిర్మించుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి సూచించారు.

**ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసుకోవాలి : కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసుకోవాలని, పురోగతిని బట్టి లబ్ధిదారులకు ప్రతి సోమవారం జిల్లా ఇంచార్జి మంత్రి చెల్లింపులు జరుపుతున్నారని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నాలుగు విడతల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. బేస్మెంట్ పూర్తి అయిన తర్వాత లక్ష రూపాయలు గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత 1.25 లక్షలు, స్లాబ్ పూర్తయిన తర్వాత 1.75 లక్షలు, మిగిలిన పనులు పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు విడుదల చేస్తున్నామన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలను మాత్రమే మేస్త్రీలకు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉంటే మహిళ సంఘాల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రుణం ఇప్పించడం జరుగుతుందన్నారు. 500 ఎస్ఎఫ్ టి వరకే నిర్మించుకునేలా సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

**ఇళ్ల మంజూరిలో మధ్య దళారుల ప్రమేయం ఉండదు : మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు**

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరిలో మధ్య దళారుల సమయం లేకుండా చూడాలని, అలాంటి దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శుభం, కార్పొరేటర్ బసవరాజు కుమార్, బల్దియా ఉప కమిషనర్ ప్రసన్న రాణి, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, తాసిల్దార్ ఇక్బాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మిర్యాలగూడలో ప్రజావాణి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమం మొదటి రోజు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,తహసిల్దార్ శ్రీరామ్ సురేష్ కుమార్,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పోలీస్ శాఖ 2 టోన్ సీఐ మోతిరామ్,ఎలక్ట్రికల్ డిఇ శ్రీనివాస చారి, పంచాయతీరాజ్ డి ఇ, ఎంపీడీవో శేషగిరి శర్మ, ఎడ్యుకేషన్ ఎంఈఓ బాలు నాయక్,ఇరిగేషన్ డిఇ,అగ్రికల్చర్ ఎంఏఓ సైదా నాయక్ నియోజకవర్గ అన్ని విభాగాల ఉన్నంత అధికారులు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని ప్రజా పాలన అందించాలి,అన్ని విభాగాల అధికారులను ఒకే వేదికపై తీసుకొని రావాలని వారంలో ఒకరోజు ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ప్రజల నుంచి సేకరించిన దరఖాస్తులను పరిశీలించి ఆ శాఖల అధికారులకు తెలియబరిచి 15 రోజుల్లో ఆ సమస్యని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు,కావున నియోజకవర్గ ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు,పెద్ద ఎత్తునప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మరో 3 గంటల్లో ఈ జిల్లాల్లో భారీ వర్షం..

**హైదరాబాద్, వేదన్యూస్ :**

తెలంగాణ రాష్ట్రంలో మరో మూడు గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో హైదరాబాద్ నగరంతో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్‌లు జారీ చేసింది. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా, మంచిర్యాల జిల్లా, పెద్దపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లా,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించారు. కాగా, హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరముంటే తప్ప బయటకు రావద్దని సూచించారు.

# ప్రతి బీఆర్ఎస్వీ కార్యకర్తకు అండగా ఉంటాం

**హైదరాబాద్, వేదన్యూస్ :**

ప్రశ్నించే విద్యార్థులపై కేసులు పెట్టే కాంగ్రెస్ పార్టీ పోలీస్ రాజకీయం చెల్లదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. విద్యారంగ సమస్యలపై ప్రశ్నిస్తే విద్యార్థి నేతలపై అక్రమ కేసులను నమోదు చేయడం దారుణమని విమర్శించారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ నివాసంలో విద్యార్థి విభాగం నాయకులతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో విద్యావ్యవస్థ సంక్షోభానికి చేరిన పరిస్థితిపై కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం పోరాటం చేస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి విభాగం కార్యకర్తకు మొత్తం పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. “తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు అద్భుతమైన పాత్ర పోషించారు. ఇప్పుడు ప్రభుత్వం ప్రజా సమస్యలపై విద్యార్థులు పోరాటం చేస్తే, వారిపై అక్రమ కేసులు బనాయించడం దారుణం. ఇది ప్రశ్నించే గొంతుకలను అణిచివేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న పోలీస్ రాజకీయం చెల్లదు” అని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరికీ వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను రాజకీయ ఆయుధంగా వాడుతున్నదని అన్నారు. “విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించిన రాష్ట్ర ప్రభుత్వం, దాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థులపై అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తోంది. సోషల్ మీడియాలో నల్లబ్యాడ్జీకి రీట్వీట్ చేసినా కేసు, మీడియా సంస్థల ముందు శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్ళినా అక్రమ కేసులు. అంతేకాకుండా గెల్లు శ్రీనివాస్ గారి భార్య గెల్లు శ్వేత ఇంటిలో ఉన్నప్పటికీ కేసు పెట్టి పోలీస్ స్టేషన్‌కు పిలవడం రాష్ట్రంలో నెలకొన్న రాచరిక పరిస్థితులకు నిదర్శనం” అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనలో పోలీసులు బడుగు, బలహీన వర్గాలపై కేసులు మోపుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణలో కొనసాగుతున్న అణిచివేత పాలనపై ఎందుకు నోరు మెదపడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు.

# మంత్రి పదవి కంటే.. వాళ్లే ముఖ్యం..

**మొదటిపేజీ తరువాయి**

చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్గొండ నుంచి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నారని.. తనను ఎల్బీ నగర్ నుంచి పోటీ చేయమని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని గుర్తుచేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అతిరథ మహారథులు అందరూ ఓడిపోయినప్పటికీ.. మునుగోడు ప్రజలు మాత్రం తనను ఆశీర్వదించారని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికలో కూడా నైతిక విజయం తనదేనని చెప్పారు. అందుకే మంత్రి పదవి కంటే కూడా మునుగోడు ప్రజలు ముఖ్యమని భావించి, ఇక్కడి నుంచే పోటీ చేశానని స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధిపై దృష్టి సారించాలి

**వేదన్యూస్, మహబూబ్‌నగర్ :**

తమ మీద కోపంతో అభివృద్ధి పనులు ఆపొద్దని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కేసీఆర్‌ను తిడితే ప్రజలు మెచ్చుకుంటారని అనుకోవద్దని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చి, ప్రారంభం కానీ పనులపై సమీక్షించి అభివృద్ధిని వేగవంతం చేయాలని, చేసిన పనులకు, గతంలో శంకుస్థాపనలు చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేస్తూ ప్రజల ముందు అబాసుపాలు కావొద్దని హితవు పలికారు. బుధవారం న్యూ టౌన్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి అయితే సంతోషమే కానీ జిల్లాకు ఆయన చేసిందేమి లేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 90 శాతం పూర్తైంది. మరో 10 శాతం పనులు పూర్తి చేస్తే జిల్లాకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసినం. జైళ్లకు పోయినం. పదేండ్లు తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేసినం. కానీ ముఖ్యమంత్రి ఏం అభివృద్ధి చేయకుండా మాట్లాడితే ఎవరు పడరన్నారు. జిల్లా మంత్రులు, ఏమ్మెల్యేలు అందరూ ఐక్యంగా పనిచేసి జిల్లా అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. పెండింగ్ పనులు పూర్తి చేయలేదు.. కొత్త పనులు చేపట్టలేదన్నారు. బీసీ రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పొంతన లేని సమాధానం చెబుతుందన్నారు. పార్లమెంట్ లో బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలని



డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతున్నారు. మరికొందరు ఆర్డినెన్సు ద్వారా రిజర్వేషన్ అమలు చేస్తామని అంటున్నారన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో కూడా రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తమిళనాడు తరహా చట్ట సవరణ చేయాలన్నారు. అందుకు బీజేపీ, కాంగ్రెస్ కలిసి ప్రయత్నం చేయాలని చెప్పారు. మన్యంకొండ రోప్ వే, ఏసి కల్యాణ మండపం, విశ్రాంతి గదుల నిర్మాణానికి టెండర్ పూర్తి చేసినం. జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. స్టేడియంలో సింథటిక్ ట్రాక్, టూరిజం హోటల్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. టీడీ గుట్ట నుంచి అప్పనపల్లి వరకు మరో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. తమ ప్రభుత్వంలో మహబూబ్ నగర్ టౌన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.200 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వ ఉత్తర్వు ఇచ్చాం. పనులు ప్రారంభించాల్సి ఉందని, ఆ పనులను వెంటనే చేపట్టాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వంలో కనిపించడం లేదన్నారు. జిల్లాకు ముఖ్యమంత్రి వస్తే నిధులు వస్తాయని ప్రజలు అనుకున్నారు. కొల్లాపూర్ వచ్చి ఏం ప్రకటన చేయకుండానే వెళ్లినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందారన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణాధ్యక్షుడు శివరాజ్, మాజీ ఎంపీపీ సుధా శ్రీ, పార్టీ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# బండి సంజయ్, ఈటల వివాదంపై ఎంపీ అరవింద్ రియాక్షన్

**వేదన్యూస్, ఢిల్లీ :**

కేంద్రమంత్రి బండి సంజయ్ ,మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వివాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో నేతల మధ్య ఉన్న వైరంపై కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. బుధవారం ఎంపీ అరవింద్ ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో రాజగోపాల్ రెడ్డి ఏం చేస్తున్నాడు.. ఆ పార్టీ హై కమాండ్ ఏం చేస్తోంది. అలాగే కొండా మురళి, కొండా సురేఖలు ఏం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో కవిత, కేటీఆర్ ఏం చేస్తున్నారు. పార్టీ అన్నాక కొన్ని వివాదాలు నడుస్తూ ఉంటాయి. బీజేపీ పాత అధ్యక్షుడు, కొత్త అధ్యక్షుడు కలిసి ఈటల రాజేందర్, బండి సంజయ్‌ల విషయంలో కూర్చోని మాట్లాడాలని సూచించారు ఎంపీ అరవింద్. అవసరమైతే బీజేపీ అధిష్టానం పెద్దలు మాట్లాడాలని చెప్పుకొచ్చారు. ఈటల, బండి సంజయ్‌ల విషయంలో బీజేపీ కేంద్ర హై కమాండ్ నోడల్ ఎంక్వైరీ కమిషన్ వేసుకోవాలని సూచించారు. రాజా సింగ్ ఎక్కడున్నా తాము గౌరవిస్తామని.. ఆయన ఐడియాలాజికల్ మ్యాప్ అని అభివర్ణించారు. ఆయన సస్పెండ్ కాలేదని.. రిజైన్ చేశారని గుర్తుచేశారు. రాజాసింగ్ రేపు పార్టీ సభ్యత్వం కోసం మిస్డ్ కాల్ ఇస్తే మెంబర్‌షిప్ తీసుకోవచ్చని సూచిం చారు. కొన్ని విషయాల్లో మనస్థాపం చెంది రాజాసింగ్ రాజీనామా చేశారని చెప్పుకొచ్చారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు ఒక్కొక్కరికి రెండు నియో జకవర్గాల బాధ్యతలు ఇవ్వాలని కోరారు.



ఎంపీ అరవింద్. ఎంపీలు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని.. ఫలితం చూపించక పోతే పక్కకు పెట్టాలని అన్నారు. ఏ పార్టీకైనా కార్యకర్తలు కీలకమని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అయ్యే సమ యం ఇదని ఉద్ఘాటించారు. ఇందూరు జిల్లాలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని తాము గెలుస్తున్నామని జో స్యం చెప్పారు. తెలంగాణలో వచ్చేవి కార్యకర్తల కోసం జరిగే ఎన్నికలని.. బీజేపీ శ్రేణులు ఈ విషయాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచిం చారు. తమ కార్యకర్తలను నాయకులుగా చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎంపీ ధర్మపురి అరవింద్ పిలుపునిచ్చారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073